భావశ్రీ

రచయిత:
బాలకవితావతంస
భోగతి చెన్నారెడ్డి
~~చాగంటివారిపాలెం.~~
లింగాల.

భావశ్రీ

రచయిత:
బాలకవి వతంస
భోగతి చెన్నారెడ్డి
చాగంటివారిపాలెం.

మనవి

పాఠకమహాశయులారా !

నేను మనదేశమందలి చారిత్రిక ప్రసిద్ధిగాంచిన పుణ్యస్థలముల సందర్శనాభిలాషతో నచ్చటచ్చట దిరుగుచు హంపీక్షేత్రమునకు వెళ్ళితిని. శ్రీ రాయలవారి యిష్టదైవమగు విరూపాక్షుని మందిరము సైతము చూచితిని. అచట చెల్లాచెదరుగా నున్న భగ్నశిల్పము లన్నియు వానిని దిలకించిన ప్రతి యాంధ్రుని హృదయమున విషాదరేఖలను గలిగించుననుటలో నతిశయోక్తిలేదు. ఆయా శిథిలములఁ జూచినపుడు నా హృదయమున గొప్ప విక్షోభముఁ గలిగి నా సంస్కారముగోలంది కొన్ని భావములు వెలువడఁ జొచ్చెను. ఉదయించిన భావములను సోదరాంధ్రులకు తెలియఁజేయు తలంపుతో నేనీ గ్రంథమును రచించితిని. ఈ గ్రంథ రచనలో నాకుఁ గల శిల్పకళాభిరుచిని తెలియఁజేయుటయే ముఖ్యోద్దేశము. నా ప్రయత్న మెంతవరకు ఫలించినదో పాఠకులే కనుగొందురుగాక.

అడిగినంతనే పీఠిక వ్రాసియిచ్చిన శ్రీ పూతలపట్టు శ్రీరాములు రెడ్డిగారికి నా హృదయపూర్వక నమోవాకములు.

ఇందలి లోపములను నాకు తెలియపరచిన విజ్ఞులకు కృతజ్ఞుడనై పునర్ముద్రణమున సవరించుకొందు.

సకాలమునకు గ్రంథముద్రణ మొనర్చి అందించిన శ్రీ సాధన ముద్రణాధిపతులు ప్రశంసార్హులు.

ఇట్లు

బుధజన విధేయుడు,

గ్రంథకర్త.

796

పీఠిక

చిరంజీవి బాలకవివతంస భోగతి చెన్నారెడ్డి భక్తిపూర్వకముగ నాయెడ కరుదెంచి 'భావశ్రీ' యను తన పొత్తము నొసఁగె. ప్రేమతోఁ గైకొని పూర్తిగఁ బఠించి యానందించితిని. ఇతడు బాలకవివతంసుఁడే. శీఘ్రగమనమున నభివృద్ధికి రాఁదగినవాఁడు. తన చిన్న కబ్బము మంచిధారతో నడచినది. ఇది సంపాద్యము కాదు మఱి సహజము. సహజధారయే చర్చనీయము. ఏపద్యమెత్తుకొన్నను మృదుల మంజుల పదములతో కమ్మచ్చున సాఁగదీసిన బంగరు కమ్మివలె నొక్కతీరున నున్నది ధార. శిథిల విజయనగరముం గండ్లారఁ జూచిన యీ కవివతంసునకుఁ గల్గిన మనోవ్యథయే యీ కావ్యమునకుఁ బ్రాతిపదిక. అపూర్వ కళా వైభవ యుక్త శిల్ప శిథిల సందర్శనా సంజనితులై తోచిన భావములు వివరించుచున్నాఁడు. చూడుడు

4 తలఁచిన మాత్రలోన లలితంపు విలాస నవీన భావముల్
5 కన్నులు కర్వుఁదీర తమకమ్మునఁ జిత్తము పల్లవింపనా మొ॥

కొన్ని పద్యములు మచ్చులే. జన్మసహజ సౌందర్యముతో ముద్దులు గుల్కుచున్నవి — కృత్రిమ సౌందర్యము క్రమక్రమముగా రావలసినదే గదా! ఈ చిన్న కబ్బమందే తుది పద్దెములం గనుఁడు. అట్టి సౌందర్యము కానవచ్చుచున్నది. గారడివాని టెంక మొలకయై చెట్టై పండ్లతోఁ గానవచ్చు మచ్చున నన్ని వయోవస్థలు కవితాకుమారికిం దగుపడుచున్నవి. ఇయ్యది శీఘ్ర పురోభివృద్ధి సూచకము.

విద్యానగర శిథిలములఁ గాంచినంతనఁ దనయంత నంతరంగమున నుండి యుబికివచ్చిన భావములు నితఁడు తన కావ్యమున నొక కుసుమమాలగాఁ గూర్చియున్నాఁడు. అందు దేవాలయములు, అందలి శిల్పము, కోటలు. అగడ్తలు, వీథులు, సౌధములు

కనులఁగట్టినట్టులు వర్ణించి తరువాత నందలి కవుల మహిమలు వినుతించి జిహ్వను పావనము చేసికొన్నాఁడు.

అట్టి మహావైభవములఁ దా మనుభవించుటే గాక తోడి ప్రజలకు ననుభవింపఁజేసిన మహారాజుల పరిపాలనాపద్ధతులఁ గొంత తడివినాడు. అట్టి ధర్మప్రభువులు లేకపోవుటచే తరువాతి కాలమున నగుచున్న దుర్భరస్థితులను మన కనులయెదుటఁబెట్టి మన యెదలఁ గరఁగించుచున్నాఁడు.

114 "అన్నమొ రామచంద్ర"యను పద్యము మొదలు 117 పద్యమువఱకుఁ జూడుఁడు. తుట్టతుదిని

నీదు వెనువెంటనే చనె నీతి జగతి
నీవు దివికేగ వనికేగె నెల్ల ధర్మ
సంప్రదాయాళి యాంధ్రభాషామతల్లి
గుండె నీరయ్యెనోయి యుద్దండచరిత.

అని కృష్ణరాయనిం గీర్తించి కావ్యమును పూర్తిగావించెఁ గాన నిది విషాదాంత కావ్యమయ్యె. ఆదిమధ్యాంతములయందు మంగళస్మరణము మనవారి లక్షణము కావున నీ బాలకవివతంసుని విషాదాంతముగా మనల నేడ్పింపవలదనియు శుభాంతములైన యనేక సద్గ్రంథముల నిప్పటి యభివృద్ధి కార్యములఁ గావ్యములుగా రచించి జనుల సంతసింపఁ జేయువలయుననియు ప్రేమతో నర్థించుచున్నాఁడ. — ఇతోధిక శక్త్యుత్సాహము లితనికి లోకేశ్వరుండు ప్రసాదించుఁగాత.

భాద్రపద కృష్ణ ద్వాదశి
1–10–56
చిత్తూరు

ఇట్లు
విద్వద్విధేయుడు.
పూతలపట్టు శ్రీరాములురెడ్డి.

శ్రీ బాలా త్రిపురసుందర్యై నమః

భావ శ్రీ

వేల్పులఁ దొల్లి యీ శిలల, విశ్వ జగన్నుత మూర్తివంతులై
కల్పము లుండుదాఁక నిల, కల్పనసేసినవారి నా మనో
తల్పమునందునుంచి బహు, దర్పమెలర్పగ నూచి గొల్చి త
చ్ఛిల్పము నవ్యరీతులఁ బ్రసిద్ధిగ నెంచెద కావ్యరీతులన్

1

ఎవ్వాని కరుణచే, నిల కళాకారుల
        కత్తి కలమ్ములు, ఘనతగాంచె,
ఎవ్వాని మహిమచే, నెల్ల దేశంబులు
        శాశ్వతానందైక, శమముగాంచె,
ఎవ్వాని యోగిచే, నిఖిలార్థకోటులు
        మురియుచు నెల్లప్డు, ముదముగాంచె
ఎవ్వాని తపముచే, నిందిరా దేవియు
        దివ్యప్రసన్నమై, తేజరిల్లె
నట్టి భూరిపరితాపు లోకైకదీపు
ధీరజన కామధేనువు ధీ ప్రతాపు
రమ్యగుణసాంద్రు శ్రీ కృష్ణరాయచంద్రు
ననవరతము నా మనమున నభినుతింతు ॥

2

ఎవ్వాని చారిత్రి, మించుటీవియపోలె
విద్యార్థి నెదలోన, వింతగొలుపు,
చాటించి రెవ్వాని, సాహసం బరసియు
వాడవాడల ప్రజల్, వరుసతోడ
కీర్తించి రెవ్వాని, కీర్తిని పలుదేశ
వాసులు నిత్యంబు, భక్తితోడ
భాషించి రెవ్వాని, భాగ్యాంధ్రభోజుగా
బండితలోకమ్ము, పద్యసమితి
నట్టి రాజాధిరాజ మార్తాండ తేజు
డంద రిల మెచ్చ కృష్ణరాయలు యథేచ్ఛ
ప్రజలఁ బాలించి మించిన పట్టణమ్ము
విజయనగరమ్ము గను మాంధ్రి వీరపుత్రి!

3

అభిషేక మొనరింపు, మంబికాహృదయేశు
నేకదంతు నివాస, మేగిచూడు,
మతిథివై కననేగు, మల విఠ్ఠలాలయు
పాకార నైపుణ్య పటిమ కొంత

పట్టాభిరామ దే, వాలయ శిల్పమ్ముఁ
గనుఁగొమ్ము కన్నుల కర్వుదీర
నర్థివై నీవు విద్యారణ్యమూర్తి భ
జింపుము చిత్త సంసిద్ధికొరకు

భువనమాతను లోకైక, పూతచరిత
మకుట మాణిక్య మణిహార మాన్యయైన
మృడను దర్శింపు భజియింపు, ముక్తినొసఁగు
లెమ్ము పయనమ్ముగమ్ము వేగమ్ము నీవు ॥

4

తలచినమాత్రలోన లలితంపు విలాస నవీన భావముల్
దొలుకు ; కథానికల్ హృదిని దోచు ; నమూల్యపు వీరగాథలున్
దలపున వచ్చి నిల్చు; సతతం బెదఁ గుల్కుచునుండు సౌరు ; ధీ
విలసితు జేయుచుండు నిలువేలుపుఁ బోలిన హంపి నారయన్ ।

5

కన్నులు కర్వుదీర తమకమ్మునఁ జిత్తము పల్లవింప నా
యన్నవ సౌరు శిల్పములు, నచ్చటిగాథలు వింతలెల్ల య
న్నన్న ! కనుంగొనం దగునుగాని వచించినఁ గర్వుదీరునే !
చిన్నగ వెళ్ళి నప్పురముఁ జేరుము జూడుము దాని యందమున్ ।

6

విహరించె నా డాంధ్రి, వీరమాత పతాక
        వినువీధి నడురాజు, వెలుగుతోడఁ
జాటించె నా డాంధ్రి, సారస్వతమ్మును
        ఖండఖండాలందుఁ గాంతితోడఁ
గనుపించె నా డాంధ్రి, ఘనులచేఁ బడిబాకు
        లరులపై కురికెడు, పరువుతోఁడ
గర్జించె నా డాంధ్రి, గర్జనల్ హరివోలె
        దిక్కుదిక్కుల నిండు దీప్తితోఁడ

శాంతి దాంతియు దాతృత, సానుభూతిఁ
గలుగఁజేసియుఁ బూర్వులు, కళలతోఁడ
ధరణి నిల్పిరి తమపేరు, ధన్యులైరి
వారి చరితంబు జూడుమా! వచ్చుమదికి ।

7

ఏమీ! యీశ్వరమాయ నే మెరుగమం దేమేమొ చిత్రంబో యా
భూమిన్వీడి పురమ్ముజేరు పథమే బుద్ధిగా దగన్నుండ! దం
దేమేమున్నదో! కన్నులం దొరలు కన్నీరందు ముమ్మాటి కం
దేమో! యాంధ్రుఁడ! చెప్పగా మనసు రేకెత్తుఁగదా! చూడఁగా ।

8

ధరణి జనించినందుల కుదార సుభావ సువిద్య నేర్చి, యే
మరక కృతార్థతంబడయు, మాన్యులు నిల్పిరి దేశమందునన్
ధరణి ప్రశస్త కీర్తులను, ధారుణి శాసనఁజేసి పెంచు నా
దొరల పురమ్ములేగి మదిఁ దోచిన దెన్నట లెస్సయౌ కనన్ ॥

9

పావనమైన తోయ మెటువైపున మ్రోయు ఝురీవిఘోషలన్
భావితరూపు నొప్పుఁ, బ్రతిభాసుర పాండురసైకతంబులన్
హా! విపరీత శిల్పముల నారయనేర్చునె జంభభేది, భ
ద్రావభృతంబుగా నెగడె నాఁడు తెలుంగుల రాజధానియై ॥

10

పనసయు నింబ పిప్పలియుఁ బాటలి దాడిమ చందనాదులున్
మనసు ఘుమాఘుమల్ దొరయు మాలతి మాధవి మొల్లజాజులన్
గన వినఁ జాలు నా కదళికాఫల ద్రాక్షయుఁ జూత జంబులన్
గనులకు హాయిగొల్పగను గాంచిరి నాఁటి సుధీరు లాంధ్రుఁడా!

11

వరుసగనుండు మ్రాకులవి, భాసురకాంతి లతాభిరామమై
మురియుచునుండు నూనములు, మోదమొనర్చెడు పక్షిరావముల్
కరుల కిశోరముల్ మఱియు, కా రెనుపోతులు కేళికూటముల్
కరమరుదాచు నెవ్వరికిఁ గాంచిన ప్రీతిజనించు లోయలన్ ॥

12

అప్సర మిట్టునట్టు గను మాంధ్రుఁడ ! నల్లడలందుఁ బెళుకుఁగాఁ
జప్పర కేళికా విడిదిశాలలు; నాకసమంటు గోపురా
లొప్పి సమస్తముం గలిగి, మ్రోయుచునుండెడు పిల్లకాల్వలన్
జెప్పుట కేరికిం దరమా, శ్రీధరు డందురుగాదె రాయలన్ ॥

13

అన్నవగుట్టలుం గలిగి, హాళియొనర్చును గన్నదోయికిన్ ;
మిన్నునుదాకునట్టి గృహమేరువలం గనినంత హాయిగాఁ
గన్నుల కింపొనర్చును; జగంబున దానికి నీడులేదు నీ
వెన్నఁడు నాపురంబుగనవేమొకొ, చూడ బిరాన బొమ్మికన్ ॥

14

కోట లగడ్త లట్టడము, కోవిదబృందము పద్మరాగపుం
గోటులుదీర్పు కుడ్యములు, గొప్ప పతాకపు హేమసౌధపున్ --
మేటి కవాటముల్, పటికమీరిన మెట్లరుదైన నూతులీ
నాటి కెడందలన్ మురియునట్లుగఁజేయు నిజమ్ము నెమ్మదిన్ ॥

15

అరదములుం గజంబులు హయంబులు వేనకువేలు సైన్యమ
వ్వరుసనె కాల్బలంబులు, నపారపరాక్రములైన ధీరులున్
గరమున విల్లుదాల్పు లయకారు లజేయులు భీమరూపు లా
తరుణమునందు నుండి రటు దవ్వున కేగుము చూచుమాంధ్రుఁడా !

16

చరమదిశానురక్తి రవిజారియుఁ గన్పడకుండుభంగిగా
సరసగుణాఢ్యుఁ డాంధ్రిల యశఃపరిపాకము దప్పి రాయలీ
ధరణిని వీడిపోయెనని తాలిమి మానిరి నే డదెందరో
కరుణనుబ్రోచువా రరుదు ; కాలము మారునటంచు నొవ్వరే॥

17

అంచిత వైభవోన్నతి ననన్యగతిం ధర రాజు లెల్లరుం
గాంచన రత్నసంచయముఁ గానుక లిచ్చుచుఁ దన్ను గొల్వఁ దా
మించిన వేడ్కతోఁ బ్రజల మెప్పు గణించు సుధీరు మాన్యు, నీ
క్షించు తెనుంగువీర మదికిఁ రచియింపఁగఁదోచు కబ్బముల్ ॥

18

కవినుతపూజ్యులై, గురుశిఖామణులౌచు వెలుంగు వేమనా
ది విభులు సాగిపోయిరిక, దేశ సుపోషకుఁడైన రాయలే
గ వినెడువారలుం గలరె, కావ్యములా, మరి కైతలా, యిసీ
కవి కల మాడునే కవితఁ గాంతి నటింపఁగ నేటి కాంధ్రిడా!

19

అలర నవీనభావముల హాయిగ పద్దెములెల్లఁ దీపిచే
గులుక రచించి చింతిలుచుఁ గుందెద రాదరణంబులేక మే
ములుకుచు కంట నీరిడుచు, ముందు పథంబును గానలేక నే
డిలు విడనాడి యీపగిది, యేడ్పులపాలయి రెందరాంధ్రుఁడా !

20

పరగ సువర్ణమా మధుర భావుక సాహితి యాంధ్రిమందునన్
దిరుఁగు ఫలంబు లేదనుచు, దీనుఁడ నౌచును హంపిఁ జేరి మున్
దొరయగు కృష్ణరాయల మృదూక్తులు కొన్ని ఘటింప నంత నా
నరసుని పేరనే కలము, చాటితి నిచ్చ భజింప నాంధ్రుఁడా !

21

ఎన్నో నోఁములు నోచినారొ, కవు లీయింపైన పంపాపురీ
పున్నెంబన్నిట వర్ణనాసహమొ, కాఁబో లో విరూపాక్షుఁడా
పన్నానీకముఁ బ్రోచుచుండి కవితా ప్రావీణ్యమే నిచ్చెనో
కొన్నాళ్ళీయెడ నుండగా హృదయ మూగుం జూడ నుయ్యాలలన్ ॥

22

నవ మాధుర్య సుధా సధార లమితానందంబుఁ జిందన్, మహా
కవియా, నాంధ్రపితామహుండు రచనం గల్పించె సత్కావ్యముల్
చెవులం జొచ్చి హృదంతరాళమున భాసిల్లోయి! తానాంధ్రుఁడా!
వివరింపంగ వరూధినీ విరహముల్, విప్రోక్త సచ్ఛీలముల్॥

24

అవిద్యాధికు, నా సుమంత నధికున్నాపూర్ణ భావోదయున్
ఆ విభ్రాజితు నార్యపూజితుని నానాకావ్య నిర్మాణకున్
భావింపం గదవోయి "భూషణకవిం" బల్మారు కేల్మోడ్చి యా
ప్రావీణ్యం బొకయింత నీ కమరెడుం బ్రాజ్ఞుల్ వహావ్వాయనన్ ॥

24

నాడిక బట్టి కాలగతి నాదమెఱింగియుఁ బారిజాతపుం
బోఁడిమి యొందుఁ దెచ్చి జగముల్ గన, కమ్మనిగాథ నల్లి యా
డాడ సభాంతరమ్ముల మహాయశ మొందుచుఁ ముద్దుముద్దుగా
నేడిచె తిమ్మ నన్నుడి కిక్కఁగు వాని గణించు మాంధ్రుఁడా !

25

ఎన్నో భావములన్ స్ఫురించు కవితానీకంబు సృష్టించి, సం
పన్నుండౌచును ధూర్జటీస్తుతులఁ దా బల్కోచెల్ల గైకొంచు నిం
కెన్నో రాయల మన్నన ల్వడసినా డిందేసుమాయంచు నో
యన్నా ! యాతని జన్మభూమి నొకమాఱైనం గనుంగొమ్మురా !

26

లోకుల్మెచ్చగ ద్వ్యర్థికావ్య రచనన్, రూపించి తొల్దొల్త నా
వాక్తేనెల సోనలై వెలయఁ జాల్వార్చెన్, ధరానేత తన్
సాకన్ రాఘవపాండవీయ మమరాచార్యుండు మెచ్చ న్భువి
న్నీకున్ సూరయ మాన్యుడంచుఁ జని యానేలం బరీక్షించుమా !

27

విన్నాణంబుగఁ బద్య గద్యముల వేఱ్వేఱం దగం జిన్నెలు
న్వన్నెల్మీరగఁ బాండురంగవిభు కావ్యంబున్, రహిన్ వ్రాసి సం
పన్నుండై కవితామతల్లజుల విద్వద్గోష్ఠిఁ గెల్పొందుచున్
మన్నీల్మెచ్చగ సంచరించిన మహామాన్యు న్మదిన్గొల్వుమా !

28

అల్ల రుక్మాంగద చరిత్రి నష్టకష్ట
ములకు లోనయి వ్రాసి, సంపూజ్యుఁడైన
వాని ఋణ మీఁగవలెనన్న భావ మింత
యైన లేదోకో ? యాంధ్రుఁడా ! యవని నీకు ?

29

సంతోషంబు నశించు నిచ్చటనుమా, సాహిత్య సామ్రాట్టు లీ
చెంతన్ భావములన్ గలాలుఁ దనువుల్, శీలంబు ధైర్యంబుఁ దా
రంతా మృత్తికలోన లీనమయి నీరంబందునం జేరి, వి
శ్రాంతిం జెందిరి నీకుఁ జింతిలగ నేలా ? వారికై యాంధ్రుఁడా !

30

లేవోయీ ! యిక సత్కథాసమితి దేలెం జూడుమా చిత్రముల్
రావోయీ ! తొల్లి యాంధ్రనాకమనగన్, రాణించె యీ ఆలయం
దేవో క్రొత్త మెరుంగుఁ బోకడ లవేయేనాటివో యంజలుల్
ఈవో ! పల్మరు స్వాగతంబనగ దోయీ ! యాంధ్రసత్పుత్రకా !

31

ఆ నగరాంతరాళమున, నాంధ్రజనమ్ముల సౌధవీథులన్
సానువులన్ సభాస్థలులఁ జందము, నందము ఆలయందుఁ దా
గోనలఁ గొండలందు, ననుకూలతగా రచియించు శిల్పమున్
గాన మొనర్చి పద్దెముల కల్పనఁ గూర్చిన మాల వైచెదన్॥

32

హేమకూటమ్మునం గల, రామచంద్రుఁ
బాదుకలఁ దాల్చి మాను, లాపదల మాని
రందు నీవేగిచూడు మానందమయునిఁ
జేరి మ్రొక్కుమ ! యాతండు సిరియొసంగు

33

సౌరభంబుల నీను చక్కని యులి దాల్చి
త్రాచుపాములఁ జేసెఁ దఱచిచూడు
నరసింహరాయల నాటి యాంధ్రుల నీటుఁ
బ్రజలించి పసమించ, వ్రాసెచూడు
చేదీప్యమై నిండు తేజంపుఁ బలుకెంపు
హారాల తళుకుల సౌరుఁజూడు
శ్రీ కృష్ణరాయల శ్రీమించు రూపంబు
సృష్టించెచూడు భాసిల్ల నేఁడు
వీర కోటీర యోధుల దొరల మునుల
సురల ఋషులను యోగుల శూలి నుమను
వెంట విఘ్నేశు నొక ఱాతిమంటపమున
కల్పితముఁజేసె నాంధ్రుఁడు ! శిల్పమూర్తి !

34

అచ్చోటు వాసి యుత్తరమునంటిన, భాసురమైన విగ్రహం
బచ్చుపడంగనా సురుచిరంబగు రూపున గుల్కు వాయుజుం
డచ్చట గానుపించ మది హా! యని దోఁచు భయంబు సుంత దా
నిచ్చ ఘటిల్ల గొప్పదగు నేర్పును జూపెను గంబమందునన్

35

ఓరా! భూతల స్వర్గమా, నగర మధ్యంబందు గోరీ లవే
ధీరోదారులవో! కళావిశారదులవో! దీపించు నిల్లాండ్రివో?
యే రాజేంద్రులవో! కవీంద్రులవో! గా కెవ్వారివో! నేటికిన్
తీరుం దప్పవు శిల్పమూర్తులవా, దేదీప్యంబునై వెల్గెదున్.

36

సకల మనిత్య మెప్పటికి, సత్యమె నిత్యము, శిల్పశాస్త్రమే
ప్రకట యశోవిభూతి నలరారె నిజమ్ము జగాన నెందఱో!
యిక జనినారు రాజులు మహేంద్రసమానులు నీదుసత్తయే
సకుఁడ! వెలుంగుచున్నయది, సౌరభమీనుచుఁ గొండఱాలపై

37

చెలువారు శిల్పకారుల కుంచెలుఁ గవుల
కలముల సాహిత్య కమ్మఁదనము
గాయక మాధుర్య కంఠముల్ యోగుల
ప్రతిభ మహాత్ముల భావపటిమ

ఆచారసంపన్ను, లాస్య లర్చకు, లుదా
    రుల క్షేమపియు మహాదళము లరయ
హిత మంత్రిజన పురో, హితులు సామంతులు
    నలులుఁ బోగరులు భా, వాలు కళలుఁ
గరులుఁ దురగమ్ము లుష్ట్రమ్ము లరులజీల్చు
ఖడ్గములు విండ్లు బరిసెలుఁ గాల్బలమ్ముఁ
గానరాకున్న వానాటి ఘనతలెల్లఁ
గాలవాహినిలో నిందుఁ గలసిపోయె

38

అడలక కొంచె మేగు మటు లారయుఁ దక్కను వ్యాసు సౌధమం
దడుగిడుమోయి! వెండియు ముదంబగు భాస్కర దేవు నాలయం
బదరు మతంగు గుట్టపయి, నందముఁ జిందగ నంత కళ్యపుం
గుడి గని లోనిశిల్పములకు న్వినతాంగుఁడవై యెనంగుమా!

39

పెనగొని చూడుమందె, యరవిందముచందము, దృష్టినిల్పి కా
దనకను నిల్వుమచ్చట ముదంబున కారయు మొల్లగుత్తులన్
వినతి నెసంగు నట్లరటిపిందెలుఁ బండ్లును బత్రజాలముల్
కనులకు హాయిగూర్చుఁ గవిగాఁడ! రచింపు సువర్ణపద్యముల్

40

దినకర దివ్యకాంతులను, దృష్టికి వ్రేగొనరింపుచు న్మహా
ఘనమయి దివ్యమై వెలుగు, కాంచనశైలమువోలెఁ బ్రిక్కలన్
గనుగొనుమోయి వారలు ప్రకాశ సుధీరులు దాని పాలకుల్
నినుగని నమ్మి రమ్మనెదు, నెమ్మని నిల్తురు పోయిచూడుమా!

41

పురములు పట్టణాలు మఱి పుణ్య నదీనదముల్ చరించి తీ
వరయ మఱెన్నొ చూచితివి, భాసురమైన విశాల శిల్పముల్
తరుణము జారిపోయిన విధానము లేదుగదోయి వేగమే
మరువక పోయిచూడు శుభమౌను నిజమ్మిది నీదుబుద్ధికిన్

42

తెలి మగ జాతికంబములఁ దీర్చిన చక్కదనంపు సోయగం
బలవిదె నేను జెప్పగను, వ్రాయగ నింకిట పండితాళికిన్
గళలను శిల్పి తా కరుడుఁగట్టగ జేసెను నొక్కచోట ని
మ్ముల విఠలేశు మంటపము ముట్టి సమాప్తముఁ జేయు నంతకున్

43

వింటివి కొంత నీకచట, వింతగు విఠ్ఠలు మందిరంబునం
దంటి వెలుంగు కంబముల కౌర విచిత్రము చూడు వానిచే
నంటిన కంచుమ్రోతయనగా ధ్వని సప్తవిధ స్వరశ్రుతుల్
వెంటనె బుట్టునట్లు చెవివిందుగ జేసెను శిల్పి చిత్రమా!

44

లేవయ్యాంధ్రుఁడ ! ధర్మచక్ర మిల సల్లీలా విలాసమ్ము నీ
భావమ్మందున గాంచుమోయి ఘనుఁడా ! భాస్వంతమహా కంబమం
దేవా చూడుము మున్ను దెన్గువిజయం బెంతేని యుచ్చంబుగా
నేవేత్త ల్వడి దిద్ది తొల్చిరో సదా యేలోటు లేకుండఁగన్

45

సురవిభు దేవతాళి నల సూర్యుని జంద్రునిఁ బ్రహ్మదేవునిన్
హరిహరులన్ రమా యుమల; నల్ల వినాయకు షణ్ముఖున్ ధరా
వరులను మల్చినావు శిలపై బహుభంగుల శిల్పికాఁడ ! మా
కరుసము గొల్పు నీ మహిమయంతయుఁ జూడగ నాఁడు నాటికిన్

46

ప్రిదులని దీక్షతో నరవిరి న్బనుజాతఁ సృజించితయ్య న
మ్ముదమునఁ దెన్గురాజుల ప్రభుత్వబలమ్మున; నాడు నాటికిన్
గొదువ యెఱుంగ దాంధ్రభువి; కోవిదులుం దలలూచి యూచి నిన్
మదినిఁ దలంచి సంతసమున న్గయిమోడ్చని రోజులున్న వే !

47

పలుమఱు శిల్పశాస్త్ర మిటు వ్యాప్తమయెంగద ! యేయుగంబులో
గల దిటువంటి లక్షణము ? గన్గొన ? రాయలనాటఁ దప్ప ; నీ
యిల నది యొక్క నూత్నశకమే యనవచ్చుఁ జరిత్ర లోకమం
దు లలితపుం గళా ప్రతిభఁ దొప్పలుఁదోగిన కాల మంతకున్

48

బంగరు సుత్తెకుం దగినభావము తీయని వెన్నముద్దయై
పొంగుచునుండ శిల్పమున బొల్పెసలారు విశాలదృష్టి వే
భంగుల సర్వమానవుల భావములందున నిండియుండగా
నంగజరూపమట్లు ధరయందు నటించెద వౌర శిల్పుఁడా !

49

ఆణి మెఱుంగు పద్యరతనాళి రచించియుఁ గావ్యదీపికా
శ్రేణిని నిల్పినారు కవిసింహులు గర్జనజేసి దివ్య క
ల్యాణపు మంటపంబను మహాంగణమందున నిప్డు నేను స
ద్వాణి మెఱుంగు పద్దెములవారము కాన్కగ నీకొసంగెదన్

50

కమ్మని చెక్కుటద్దములఁ గాంతులు గుల్క మొగాన; మంచి భా
వమ్ములు పిల్లుకోచు కనుపాఁజును దీర్చితి వొక్క కాంతకున్
ఇమ్మహి నీదు నేర్పునకు నీశ్వరుఁడై నను మౌళిఁ దాల్పఁడా ?
నెమ్మది దేవశిల్పి ! యువనింగల శిల్పుల కొజ్జవీవగా !

51

కోమలిగుంపు మారు విరికోలలు నంచలు బర్హిసంఘముల్
గాముని సేనలా చిలుకకందువలన్ మఱిఁ గోయిలమ్మలన్
డీమన మొప్ప నీటగు గతిన్ సృజియించితి వెంతవాఁడవో
భ్రామిక మందఁ జిత్త నవవారిజముల్ సుఖవార్ధిఁ దేలఁగన్

52

పిడికెఁడు కౌను బాహువులు పెద్దవి చూడ సెబాసు — భేషురా
పడతుక మోవి కెంజివురు భామకనుల్ మరువిండు లందమౌ
యుడుపతిమించు నెమ్మొగము నొప్పగు బొట్టమరించి మించు రా
పడతుక యో యనంగ నొక భామిని గూర్చితివయ్య శిల్పకా!

53

ముసుగిడి యొక్క చోట నొక ముద్దియనుంచితి చూడఁజూడ నా
పసదనమే మొగాని — బహుభంగులఁ దోచెడు చిత్తమందు దా
రసికుని గోరి యొక్కని జిరంబుగ ఘోరతపస్సు దీక్షమై
విసువకఁ జేయుచున్న దనిపించును జూపర కెల్ల శిల్పుఁడా!

54

భయద శార్దూల సింహముల్ పదిలపరచి
ఈ శిలాతతి హత్తినావేమొ శిల్పి;
అట్లుగాకున్న యింతసాహసము కల్గ
నేర్చునే వేరొకని కిందు నెమ్మిఁ బొగడ॥

55

పలుమరుఁ జూడఁజూడగను భావము పేరెదఁబొంగు నేరిక
న్నలవియె నిట్టి కల్పనము నాంధ్రులెగాదు జగానలేరు; నీ
లలితకళా విలాస రుచులన్ సరిపోలిన వారు నెందు నేఁ
దలఁచెదఁ బూజఁజేసెదను దప్పక నెప్పుడు నిన్ను శిల్పుఁడా!

56

మలచిన ఆలయమందుఁ గుసుమమ్ము లనేకము దిద్దినాఁడవా
ఫలమది రిత్తవోవునె శుభంబుగ నేటికి నిల్చె నవ్వి నీ
యలఘు తపఃఫలంబుగ నయారె జగంబులఁ బూజలందుచుర్
సులలిత భావపాండితియుఁ జోద్యముగా వెలుఁగొందు శిల్పుఁడా!

57

చక్కదనంబు లొల్కగను సాహసమంతయు మూసవోసి బల్
చొక్కపు నీ యులిం గొనియుఁ జోద్యముగా రచియించినా వహా!
యక్కజమైన యా వృషభ మారయ నేగతి సృష్టిఁజేసితో
నిక్కము బ్రహ్మవేయగుడు నీదగు సృష్టికి నాతఁడోపునే!

58

పద్మజునకన్న నీకెట్టి భావమందు
లోపమేలేదు చూచిన లోకమందు
జీవమూర్తుల సృష్టించు దేవుఁడతఁడు
శిల్ప సృష్టిని దానెట్లుఁ జేయగలఁడు?

59

నగవు జనించు నబ్బురమునో యెటులర్ రచియించినావో య
త్యగణిత రూపుఁడౌ నృహరి నారయ భీతిజనించుగాని కా
లగతి వశంబుచే నదియు లావును దగ్గెనుగాన నెందు మె
చ్చుగ నినుఁ జెప్పుకొందు రిటు సూచిన భారతజాతి వీరులర్

60

ఎఱిఁగితివేమొ వాణి మది నెన్నితివేమొ సుమాలలామనున్
ఎఱిఁగినవాఁడవేమొ రమ నెంతయు సవ్విధి కేశవు స్భవు
న్నఱుదుగ సేవఁజేసి మును నందితి శిల్పమునంచుఁ దోచు నీ
గఱచిన విద్దె లేమెరుగఁ గాలముజాలదు శిల్పచంద్రమా !

64

చిరునగ వంకరింప నొకచేతను సుత్తెనుబట్టి శిల్పపుం
బరికరముల్ యమర్చుకొని వాసిగ గీముననుండి చుట్టముల్
నరగున వెంటరా నడచి చక్కని బండలఁజేరి శిల్పము
న్నరుదుగ సృష్టిజేయు నిను నారయ నాకు మనంబు గల్గెడున్

62

అన్నవు నీవు తమ్ముఁడను నొందును నే నొక జాతివారమే
యన్న ! సుశీల యిద్దఱము నందు రచింతువు నీవు శిల్ప మ
భ్యున్నతితో సుధామధుర బోధల గాథల మేము కావ్యముల్
చెన్నగవ్రాయఁ గీర్తిగను శిల్పము కబ్బముగూడ సోదరా !

63

లోకాలోకము లెల్లను
జీకటిగాఁజేసి నీవుజేరిన పిదపన్
మా కవివర్యుల భావ
శ్రీకతమున ధరను మఱలఁ జెలఁగెదవయ్యా !

64

ముని మనుజా సురాహిసుర మూర్తులలోన నశేయుఁ డీవెగా
వు నను దిరంబుగన్ యశముఁ బూజ్యతయుం దగ నిల్పుకొంటివో
యనఘ ! నినుం దలంప మదియందునఁ దోఁచు నవీనభావముల్
గనుగొని నిన్ను నేఁ బొగడఁగా దలపోసితి శిల్పచంద్రమా !

65

అన్నా యెన్నఁడు నీ వొనర్చితివి మాకారాధ్యమౌ శిల్పముల్
కన్నారం గని మెచ్చినాము మదిలోఁ గైవారముల్ జేసి నీ
విన్నాళ్లెయ్యెడ కేగినావొ సుకృతీ ! యేలోకమందుంటివో
కన్నీరిచ్చుచునుంటి తర్పణము నేఁ గైకొమ్మిఁకన్ శిల్పకా!

66

నాతోడ న్విహరింపు కొంతవడి నీ నాణెంబునం జూపు మా
నీతుల్గొన్ని వచింపుమోయి మఱి నీ నేర్చెదొ నేర్పింపు క్రొ
త్త్రొతళ్కుల్ దగఁ గాంచ భావ మపుడున్ ధన్యంబు మాన్యంబునౌ
చేతుల్ మ్రొక్కెద శిల్పరత్నమ ! యిదే జేజేలు గావించెదన్

67

కోపమ నాపై సోదర !
నాపాపమ నిన్ను భక్తి నలరింపన నీ
రూపముఁ జూప వికేలా ?
బాపురె ; నాజీవితంబు భగ్నంబయ్యెన్

68

ఇందలి వైభవములలో
నందముఁ జూడంగ మదికి నబ్బురమాయెఁ
ఎందుండినావో రాయల
యందుకొనుము వందనంబు నాశ్రితభోజా!

69

ఓ కరుణాలవాల సుగుణోన్నత! చారుకలాకలాప నే
డీ కవిపుంగవుల్ దమకు నెద్దియులేదని చింతబొంద నీ
వేకడనుంటివో తెలుఁగ మీఁగతి హాయిగఁ బండితాళినిఁ
సాకగలారు లేరు పరుసందన మేలను కృష్ణరాణ్ణృపా!

70

హితులును మంత్రిపుంగవులు నిష్టులు దారులు గాయకాదులున్
సుతులు సుమిత్రులు న్జైలులు సుందరమూర్తులు రాజపుత్రుల
య్యతుల యశోవిభూషితులు నప్పటి పెద్దన ముఖ్య సత్కవుల్
నుతులొనరించు వైభవ మనూన సురూపముఁ జూపుమో నృపా!

71

అల్పాహారముల న్భుజింపుచును నాయా దీనభావాలతోఁ
బోల్పన్రాని కురూప యానములతోఁ బోనున్న ప్రాణాలతో
సల్పన్నాసగిరి జీవయాత్ర లెటులో నంఘూన నీ సత్కవుల్
కల్పాంతాగ్నివలెం దరిద్రమెపుడుం గాఁరించురా రాణ్ణృపా!

72

అందం దారసిచూడఁ దాతయనువాఁ డయ్యో ధరం లేఁడికే
మందు న్బాధలు నెక్కుడయ్యెఁ గవితామాధుర్య మింకేల నా
యందున్నాని భవాని ప్రోద్బలమునం దందంబు చిందం రహిం
బొందర్ తాళ్ళు గలంగ మోళ్ళు చివురుల్బాల్పొంద నే వ్రాసితిన్

73

నీవున్నప్పు డెవండుగాని యిటు హానింజెంది బెండయ్యెనే!
భావంబెంత తపించి కుందెడినొ? భూపాలా సుఖంబేదియుం
గేవల్లచ్చియు నీతివీడ కెటులో జీవించుచున్నాము మా
కావంత్తైన జయంబులే కిటుల మే మార్తిన్ దినాలెన్నుచున్

74

ఎండన్ వానను నోర్చి బాధపడితిం కెన్నేళ్లు లిట్లానొకో!
వండంజో టిసుమంత లేక చలిలో బాధం దగం బొందినన్
రండంచు న్మనసారబిల్వ రొకరైనం జేరి; యీతీరుగా
నుండ న్జీవితయాత్ర సల్పగలనా! యోజింపు రాజాధిపా!

75

ఎన్నేభంగుల నూహఁజేసినను నా కేదారి గన్పట్ట దిం
కెన్న న్గుక్షిని నింపుకోగలుగ నాకెంతైనఁ గష్టంబె పో
కన్నుల్గాయలు కాచె నిద్రయనగా గానంత నిష్టంబుగా
దన్నా! నన్నుఁ గృపారసాన గనువాఁ డయ్యో యెవండుండునో!

76

దేవా! నీచరణ ప్రసాదకణ లబ్ధిం గాంచఁగాలేనో నా
కేవారిత్తురు తిండిగుడ్డలను నింకేమార్గ మూహింతునో
భావాలా – చివురింపఁజాల కెవియో బంధాలకుం జిక్కె నే
నేవో మేడలు గట్టుకొంటి నవి యిం దే యుండునో, ఊడునో!

77

పదియాఱేడులనాఁటి ప్రాయమునఁ గావ్యాలందు నీకీర్తి క
న్య దిగంతంబులఁ బ్రాకెనం చెఱిఁగి యానాఁడే నిను నెమ్మేటికో
విదులా శిల్పులఁ జిత్రకారులఁ గవుల్ వేభంగులం గొల్వ నా
కదియే చాలనుకొంటి దానినిపు డే గాంచంగ నుత్సాహమా!

78

నాడెందంబున కావ్యకన్య' మిగులన్ నైరాస్యముంబొంది దా
వాడంబారియు మోమువాల్చినది నెవ్వారిం దరింజేర నే
జూడం జూడఁగఁ గూర్కులేక నిశలం జోద్యంబుగా నిన్నుఁ దా
వీడం వీడియుగాని నిన్నుఁగనక న్వేమూర్ఛలం బొందెడున్

79

సద్గుణశాలివైన నిను సంస్తుతిఁజేయుచు నెల్ల వేళలన్
హృద్గతమందు నెంచు వరియింపఁదలంచి నృపాలచంద్ర యు
ద్యద్గళ దశ్రువుల్ వరదలై ముఖపద్మమునందుఁ జిందఁగా
గద్గదకంఠియై కవిత కన్య వగం దిగులొంది యిట్లనన్

80

ఇటు బళ్ళారి యనంతపూరు కడప న్నింపైన కర్నూలు కా
దట నెల్లూరు తెనాలి బందరుల మధ్యంగల్గు దేశంబు ముం
దట గోదావరు లాంధ్ర దేశపు సువిద్యా విశ్వవిద్యాలయా
తట భాగమ్ముఁ గనుంగొనం దగినభర్తన్ గానవో రాణ్ణృపా!

81

ఉన్నా రెన్నిక కెంద రే మనుజు లీ యుర్వీస్థలి న్నెందఱో
నే నున్నాఁడఁ గవిత్వమాధురులలో నిగ్గులనుంగొంకు నం
చెన్నజ్జాలు తెనుఁగు రాయఁ డొకఁడేని యుక్తి లేఁడారయన్
వన్నెల్వాసనలేని పూవుల విధంబై రాంధ్రు లీనాటికిన్

82

బాల్యంబంతయు నెట్టులోఁ గడచిపోవం బ్రౌఢనై యుంటి సౌ
శీల్యం బేర్పడఁజేయునట్టి వరుఁ డీ చెంతారయన్ లేడు సా
కల్యం బేపగిదిన్ లభించు నకటా! కన్నీరు మున్నీరుగా
బాల్యంబందుననుండి నేడ్చెదను నే బాండిత్య భావోదయా!

83

చావడులన్ బడుల్ గుడుల సత్రముల న్నడువీథులందె నా
జీవితయాత్ర సాగగ రచించెనొ యేమొ పితామహుండు నే
భావుకమైనదాది పెరవారిగృహాల దినాలు వెళ్ళుచే
జీవితమంత దోచెడు నిశీథమె కాపురమేమొ యక్కటా!

84

ఘనమై దుస్సహమై మహాభయదమై గంభీరమై ఘోరద
ర్శనమై వివ్వెఱఁగొల్పుచుండెడు దరిద్రంబెప్పు డేనాటికై
నను నా వన్నెలుఁ జిన్నెలు న్దఁగు వన్నద్దమ్ము లింటింట వా
కొనునాఁడేను దొలంగు గష్టములు గాకున్న న్ననన్నాబయునే

85

ఒకటా రెండని లెక్కపెట్ట వశమా! నూహింప నాకష్టముల్
నుకవీంద్రా దరపోవకా వినగదే సూక్తుల్ ధరన్నిత్య లే
ని కొఱంతో; కవికర్మమో; కవిత దా నిర్జీవమైపోవు నా
చకమో; యూరయకుంటినిప్డు వగచే వత్యంబురా రాణ్ణృపా!

86

ఎన్నడు నామదిన్మఱువనేర నిను న్విను పూటపూట నే
నెన్నుచునుందు నీయశము నిందుకులాన్వయ; నీపడంతి క
న్నన్నలయుందున న్నిలువ నంతనమొందెద నుంత నేఁడు మీ
రున్న వివాహమాడి నను నంచుకొనం గలరేమొ చెంగటన్

87

తోడునీడయు లేనట్టి తోయజాక్షి
బ్రతుకు భారమ్ము బ్రతికిన ఫలము గలదె
నీరులేనట్టి లతిక యేతీరుబ్రతుకు
ననెడు తనయను నోదార్చ నంటి నిటుల

88

కొంత సుఖంబునున్గలుగుఁ గోమలి నీ కిపు డాంధ్రభోజుఁ డీ
చెంత పదమ్ములుంచి నడిచె న్నవి మాళిధరించి భక్తిఁ బూ
జింతువటంచు నెంచి నినుఁ జేడియ నాతని కిచ్చినాఁడ నీ
చెంతను లేఁ డతం డెటులఁజేతువొ కాపుర మక్కటక్కటా!

89

ఏలె నొకప్పు డాంధ్రధరణీతల మెల్లఁ బ్రజాళి కింపుగా
వ్రాలని యన్యభూవరుల వంచి వశంబుగఁ జేసికొంచు గ్రా
మాల నొసంగి పండితుల మన్ననలంది ప్రజాదరంబునన్
గ్రాల రచించె నిగ్గుల సుకైత సుమా! దుహితా! రసజ్ఞుఁడౌ

90

నీ వేనాఁ డుదయించితో తనయ నా నీకష్టజాలమ్ము లిం
కేవ్వేళైనఁ దొలంగునంచనెదు యూహే లేదు నాపైన నీ
వావేశంబునుఁ బొందబోకు నినుఁ గాదంచున్ సుఖంబొంద లే
దేవేళన్నది నీవెఱుంగ నదియే; యేమందు వీమాటకున్

91

సవతులున్నారు వారలు చతురమతులు
ఎట్లు మెలగెదో! యెరుగనో యింతి నీదు
మృదుమధుర భావసుమముల మొదల వారి
పాదములనుంచి పూజించి బడయు శుభము

92

ఓ పరమోపకారనిధి ! యో నియమోన్నత చారుదీప్త ! నీ
ప్రాపుననుండియే కవులు గ్రాలు సుకావ్యము లల్లినారు గా
దే పెనుప్రాపు నాకొకటి యే నటువంటిది గూర్చి భూత ధా
త్రీపతి కృష్ణరాయ దయఁ దేల్పుము; నీకది యొక్కలెక్కయే —

93

ఏలోకంబున నుంటివో; యచట నీకేమేమి శుశ్రూషలో
యాలోకమ్మున బెద్దనాది ఘనులున్నారా ? కవిగ్రామణుల్ !
జాలన్జెక్కిన శిల్పియుంగలఁడె ? వీరాగ్రేశ్వరుల్ వీర లిం
కేలోకమ్మున కేగినారొ? మది నూహింపంగలే మక్కటా !

94

నీవు గుణాంబురాశివి వినీతుఁడ వెంతయు నొక్కసారి నీ
పావనమూర్తిఁ జూపుము నృపాల ! సుధీర గభీర ! నేఁడు నా
పావవకైత తీవియ కుపాయన మిచ్చెదు రాజు లేమి నా
భావ సుమమ్ములెల్ల వసివాడి గృశించెను గృష్ణరాణ్ణృపా !

95

ఉన్న న్నాల్గుదినాలు తిండి కెటులం చుత్సాహమేతగ్గు నిం
కన్నంబొల్లక యొక్కనాఁ డెటులొ ప్రాలందుం బరుండన్ సరే
యన్నన్నే చలిబాధకై యెటులఁ గాయంబున్ సహింపంగ నిం
కెన్నో వేలకొలంది గల్గు నిడుముల్ యిట్లైన నెట్లానొకో

96

పదపద మంచునాక లోకవంకకు లాగుచునుండ వద్దు - నీ
కిది తగదంచు చిత్తమిక యేదరిఁజెందఁగనీక యుండుటన్
హృదయముఁ దేనికీయవలెనంచు నెఱుంగక చింతచేత నా
సతనముఁ బాసినప్పుడె ప్రసాదములేదు భుజింపఁ దృప్తిగన్

97

నిద్దురలేచి నేను నవనీత సుధారసధార వాకలన్
బద్దెముల న్రచింతు నవి స్వాదువు నించునో లేదో గాని యే
ప్రొద్దు తెనుంగు సోదరు లపూర్వమతిం జవిఁజూచుచుందురీ
యొద్దన గాని వానిపయి నూహాలు తేలవటంచు నెంచెదన్

98

రాజా! యెందుల కేగితో కవినుతా! రమాస్రంధ్రభోజాంకితా!
తేజోధీర ధురీణ యాంధ్రమఘవా! దీనార్థి కల్పద్రుమా!
మా జోహారుల నందుకొమ్మనుచు నిన్నాత్రయాంధ్రు లెల్లప్పుడున్
పూజల్ సేతురు సంతసంబు నతులం బూర్ణప్రమోదాత్ములై

99

శీతాగారముతో కొలంకులు దరుల్ నీళ్లైన పంపాఝరీ
తీరంబుం వితలేశ్వరాలయము దీప్తింబొందు హేరంబు ప్రా
కారంబుం భువనేశ్వరీ నిలయముం గానంగ నాకెందు నీ
పేరం బిల్వఁగఁ గానరా వెచట రావే దీను నన్బ్రోవుమా!

100

శోధింపంబడె కోటలం బురుజులం సొంపైనఁ బూదోటలన్
సాధింప న్నిను కొండకోనలను బ్రాసాద ప్రదేశంబులన్
వీథుల్ రచ్చలు రాజమార్గములు దీప్తింబొందు శిల్పాలలో
గాథల్ వేయును నేల? రమ్ము సుమతీ! కన్పింపు పూజించెదన్

101

కామోత్కంఠతతో నినుం బిలువగాఁ గాన్పింపఁగా రాక నీ
వేమూలో మఱి డాగినావొ దెసల న్వేమాఱుఁ నేఁజూచి తీ
సీమన్లోరిక వ్యర్థమయ్యె ననుచుం జేరంగలేనంచు నిం
కేమో భావనతోఁ బరుండ నిదురెంతే లేదురా రాణ్ణృపా!

102

ఏకాంతంబున నన్ను నేనె మదిలో నేమేమొ తర్కింతు నిం
కేకాలమ్మునకో మిముంగనుట యం చెంతుం ఘనుండంచు నిన్
శ్రీకారంబును నాంధ్రదేశమునకుం జేకూర్చి తానాఁడు నే
శ్లోకింతు న్నిను నిత్యముం దలఁచుచున్, శుభ్రాంశు వంశోత్తమా!

103

ఉత్సాహంబు నశించె భీతివొడమెం దేజస్సు క్షీణించె నా
హృత్సారంబుఁ దోలంగె భావచయ మా యేటంబడెం జూడు — న
స్వత్సా రమ్మని జేరఁదీయవలదా పాండిత్య భావోదయా!
సత్సాంగత్యముఁ గోరుచు న్మఱిమఱిం జర్చింతు రాజాధిపా!

104

అజ్ఞానాంధత లోభ మోహములచే నాంధ్రానుజుల్ మున్గ నీ
విజ్ఞానారుణదీప్తులంబఱుపఁగా వేగమ్మ ; రమ్మోయి త
త్వజ్ఞత్వమ్మును వాక్పటుత్వ గరిమన్ స్థైర్యంబు ధైర్యంబునన్
సుజ్ఞానత్వ మొసంగు మిక్కలి కికే శుభ్రాంశు వంశోత్తమా !

105

అన్నా ! యాంధ్రులిల యాఁకిబాధ లుడుపన్నారార యొక్కండు లే
డున్నాడంచును నిత్యముం దలఁచుచుం గూర్కెప్పుడున్ లేక మే
మున్నా మిప్పుడు ముందికేమగునో మా కూహింపఁగాఁ బోల దీ
కన్నుల్గాయలుకాచెనోయి మఱివే గన్పింపు మా కిచ్చటన్

106

ఆర్తజనంబు బ్రోవుటకునై తమ లాభ మొసంగి మించి స
త్కీర్తి తెనుంగుదేశమునఁ దీప్తివహించిరి నాఁటివారు కా
మార్తులు నేటివార లిసుమంత దయారసముంచబోరు దా
రార్తుల కొంపలన్గడపి హాయిగ నుందురు కొందరానన్

107

చూడఁజూడఁగ నామభావమునకుం జోద్యంబుగాఁ దోచు ని
న్నేడ న్నేఁ గనుగొన్న యీకవిత యేవేళ న్నుతింబొందు నో
ప్రోడా ! నాకిల గాకపోయిన నరే మోదంబు మావారికిం
జాడ న్గుర్తులఁ జూపిపోవెదగదా ! చంద్రార్క తేజోమయా !

108

నీలావణ్యము నీబలంబు మఱియు న్నీసొంపు నీఠీవియుఁ
వాలాయమ్ముగఁ జెలంగు నాదుమదిలో వర్ధిష్ణుతాపద్ధతిఁ
కేలునొర్మద్దును నీముఖాబ్జ మనురక్తిం జూపుమంచుం గలిఁ
గాలమ్మా మఱి మారిపోయె సకటా! కన్నీరు వారింపుమా!

109

మానవనాథ నేడు వినుమా! యిలఁ జీకటి గ్రమ్మె బెద్దలుం
బూని కవీంద్రులన్న మదిఁ బొల్పువహింపరు పోని మెప్పుగా
నైనను మాటలాడెదరటన్న వాళిక్క్యయ; యాంధ్రజాతికు
న్నే నయమింత—? యిట్టియెడ నీవయినం జనియించి రావయా!

110

వలబడియుండు శారికముఖంగిఁగ నాంధ్రులు హూణభాషలోఁ
పలఁ బడి యాంధ్రమే మఱచి బారలువైచుచునున్నవార లం
జలిని ఘటింప నీమదికి సంతసమొంద దదేమికర్మ మి
య్యాల మలిసారి యాంధ్రులనె యేలు నుకేంద్రునిరీతి రాణ్ణృపా!

111

అలర బిడాలు రీతిగ ధనాఢ్యులు మేడలనుండి తేపకుఁ
బులుసును నప్పళంబు ఘృతముం మఱిఁ జక్కెర పాలు మీగడల్
బలమగు కాయగూరలను బాయసముద్దగ లడ్డు దోసె లిం
పలరగ మెక్కి బీదలనువారి గ్రసించుట నయ్యె భూమిపా!

112

దండిత వైరిమండను లుదారగుణాఢ్యులు రైతుబిడ్డ లా
కొండలఁ గోనలం దరులఁ గ్రొచ్చియు సారములేని భూమి యే
నెండకు వానకోర్చి హలమెత్తియు సాగొనరించి మించిరక్
బండను జోటులేదు తగవా ? శ్రమకెయ్యెడ విల్వబోయఁగా!

113

అకలుషులైన కర్షకు లహోయని నీదు చరిత్ర చిత్తమం
దొక నిముసంబయేని మదినుంచక నిద్దురపోరు రాజ ! యిం
తకుఁ దగు కారణంబు సుపథంబున నీ పరిపాలనంబు హా
లికులకుఁ బ్రాణదాన మిడె లీలఁగ నాఁడిపుడెంత కష్టమా !

114

అన్నమొ రామచంద్ర యని యాఁకటికిం దనువుల్ బొకార్చుటా
పన్నమయెం బ్రజావళికి ; శాసకుఁ డొక్కఁడు గానరాఁ డికే
మన్నను పెద్దలంద ఱిల ; నాదృతి యెచ్చట గోచరింప ద
న్నన్న ! జగంబు బెంకువడెఁగా యొకమా రిటు చూచిపోవయా !

115

రవికెయుఁ జీర లేక సుత ఱాతిపయి న్నిదురింపఁజేసె నే
యువతియొ పత్రముల్ మొలకు నుస్సురటంచును జుట్టి భిక్షకై
యెవరిని వేడినం బలుకరించక పోయినఁ బుత్రి జేరి యా
యువతి గతించె నేఁడు నొకయూరను దుర్భరమౌను రాణ్ణృపా!

116

పుట్టిననాఁటనుండి యొకపొ్రద్దును గమ్మనిభోజనమ్ము దా
నెట్టిదొ నేరనంచు నొకయింతి కరమ్మునఁ జోలె దాల్చియున్
గట్టిగ నేడ్చుచుండఁ గని కానకయుండిరి పాదుషాలయో !
ఎట్టి విషాదసంఘటన మియ్యది ! యామె గతేమిభూమిపా !

117

ముదుసలి కఱ్ఱఁ జేతఁగొని ముందుకువచ్చి యొకింత యన్నమున్
ప్రదులను భక్తిఁగోరి యట మూర్ఛిలఁ బొ్రథ యొకర్తె యా సతిన్
గవిసియుఁ దాొ్రటగట్టి యుదకంబున నిర్దయఁ ద్రోయఁబోయె నే
మి దయయొ చూడు మూర్ఖపొ్రజ ! మేలెటు సేకురు నింక భూమిపా!

118

నీదు వెనువెంటనే చనె నీతిజగతి
నీవు దివికేగ వనికేగె నెల్ల ధర్మ
సాంప్రదాయాళి ; యాంధ్రభాషామతల్లి
గుండె నీరయ్యెనోయి ; యుద్దండచరిత ।

119

ఓం తత్సత్

తప్పొప్పుల పట్టిక.

పేజి	పంక్తి	తప్పు	ఒప్పు
1	2	మనోతల్పము	మన స్తల్పము
6	2	కేళి కా	కేళికల్
6	6	మేరువ	మేరువుం
11	8	చూచు	చూడు
12	6	కళావిశారదులవో	కళావిదులవో
15	1	లేవ్యయాంధుఁడ	లేవో యాంధ్రుడ
15	6	రమాయుల	రమాగజల
15	13	మయొంగద	ముత్తైనవి
19	6	యమర్చుకొని	పాళికూర్చుకొని
23	16	నిట్లను౯	యిట్లను౯
24	12	నేడ్చె	యేడ్చె
25	8	వత్సంబు	సత్యంబు
26	5	ధరణీ	సుమహీ
27	5	శిశ్రూష	శుశ్రూష
27	16	నిడుములో	నగచాట్లకైన
33	6	బిరుదులను	బిరుదులని

— నాచే రచింపబడిన గ్రంథములు —

—)O(—

భావశ్రీ

జగన్నాయక శతకరత్నము

స్వప్నానిరుద్ధ (అముద్రితము)

చీకటి దారలు ,,

భగ్నహృదయ ,,

శ్రీ సాధన ప్రింటింగు లిమిటెడ్, అనంతపురం.